VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers


# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 289

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శుక్రవారం 3 ఏప్రిల్ 2026





# అమరావతి (మంగళగిరి) శాలువాతో ప్రధాని మోదీకి సత్కారం.. కృతజ్ఞతలు తెలిపిన మంత్రి నారా లోకేష్!

● మన రాజధాని సంస్కృతిని, హస్తకళను దేశ రాజధాని సాక్షిగా గౌరవించారు!



**న్యూఢిల్లీ, కలంకౌంటర్ :** ఐదు కోట్ల ఆంధ్రుల దశాబ్దాల నిరీక్షణకు, వేలాది మంది రైతుల త్యాగానికి ఎట్టకేలకు ఒక చట్టబద్ధమైన విజయం లభించింది. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు లోక్‌సభలో భారీ మెజారిటీతో ఆమోదం పొందడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం. ఈ చారిత్రాత్మక విజయం సాధించిన తరుణంలో, రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ భేటీలో ఒక ప్రత్యేక ఆకర్షణ నిలిచింది. తనను గెలిపించిన రాజధాని ప్రాంతంలోని మంగళగిరి నియోజకవర్గ నేతన్నల నైపుణ్యానికి ప్రతీకగా, అత్యంత నైపుణ్యంతో నేసిన మంగళగిరి చేనేత శాలువాతో ప్రధాని మోదీని లోకేష్ ఘనంగా సత్కరించారు. మన సంస్కృతిని, హస్తకళను దేశ రాజధాని నడిబొడ్డున గౌరవించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఏపీ అసెంబ్లీ పంపిన తీర్మానంపై లోక్‌సభలో చర్చ జరిగింది. దేశంలోని అన్ని పార్టీలను అమరావతి వైపు నిలిపి, బిల్లుకు చట్టబద్ధత వచ్చేలా చేసిన ప్రధాని వ్యూహాన్ని లోకేష్ కొనియాడారు. బిల్లు ఆమోదం పొందిన వెంటనే మంత్రి లోకేష్ హుటాహుటిన ఢిల్లీకి చేరుకుని, కూటమి పార్టీల ఎంపీలను అభినందించారు. "ఇచ్చిన మాటకు కట్టుబడి, కేంద్ర ప్రభుత్వం అమరావతికి అండగా నిలిచింది" అని లోకేష్ ఈ సందర్భంగా ప్రశంసించారు. గతంలో అమరావతి విషయంలో ఏర్పడిన అనిశ్చితికి ఈ బిల్లుతో తెరపడింది. పార్లమెంటు సాక్షిగా జరిగిన ఈ ఆమోదం, అమరావతి నిర్మాణానికి అడ్డంకులు తొలగించడమే కాకుండా, భవిష్యత్తులో ఈ ప్రాజెక్టును ఎవరూ అడ్డుకోలేని విధంగా బలమైన పునాది వేసింది. "ఐదు కోట్ల ప్రజల ఆకాంక్ష నెరవేరింది. అమరావతి అంటే కేవలం ఒక నగరం కాదు, అది ఆంధ్రుల ఆత్మగౌరవం. ఆ ఆత్మగౌరవానికి పట్టాభిషేకం చేసిన ప్రధానికి ధన్యవాదాలు." --- నారా లోకేష్ ఈ విజయం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది!





అమరావతి కి చట్టబద్ధత కల్పిస్తూ రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లు కి ఆమోదం పొందిన తరువాత కూటమి ఎంపీలకు అభినందనలు తెలిపిన మంత్రి నారా లోకేష్. బిల్లు కు మద్దతు తెలిపిన పలు పార్టీల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేసిన లోకేష్. లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ను కలిసి ధన్యవాదాలు తెలిపిన మంత్రి నారా లోకేష్, కూటమి ఎంపీలు.
–ఢిల్లీ,కలంకౌంటర్ :

## అమరావతికి చట్టబద్ధత..కేంద్రం నిబద్ధత

- ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలియజేసిన మంత్రి నారా లోకేష్



**న్యూఢిల్లీ,కలంకౌంటర్ :** ఐదుకోట్ల ప్రజల ఆకాంక్ష అయిన అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పూర్తి మెజారిటీతో పార్లమెంటు ఆమోదం లభించడానికి కృషి చేసిన ప్రధాని నరేంద్ర మోదీ కి ఏపీ విద్యా–ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఏపీ అసెంబ్లీలో చేసి పంపిన తీర్మానంపై లోక్ సభలో సుధీర్ఘ చర్చ జరిగిన అనంతరం అమరావతి బిల్లును ఆమోదించారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు నిలిపి అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పించిన ప్రధాని నరేంద్ర మోదీ ని పార్లమెంటు హాలులో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. లోక్ సభలో బిల్లు ఆమోదం పొందిన వెంటనే ఆగమేఘాలపై ఢిల్లీ వచ్చిన మంత్రి లోకేష్ కూటమి పార్టీ ఎంపీలను అభినందించారు. అనంతరం గురువారం ఉదయం ప్రధానమంత్రి మోదీని కలిసి అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్ సభ ఆమోదంపై ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కేంద్రప్రభుత్వం చూపిన నిబద్ధతను మంత్రి ప్రశంసించారు.

# అమరావతికి పార్లమెంట్ చట్టం...తిరుగులేని శాసనం

● బిల్లు ఆమోదంతో ప్రజా సంకల్పానికి గౌరవం ● రాజధానికి వ్యతిరేకంగా వాకౌట్ చేసిన వారిని బ్లాక్ అవుట్ చేయాలి ● మావిగన్ అంటూ రాజధానిపై అపహాస్యమా.? ● అమరావతి రైతులతో సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ● సతీసమేతంగా దీపహారతిలో పాల్గొన్న ముఖ్యమంత్రి ● ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా, బిల్లుకు మద్ధతు తెలిపిన పార్టీలకు ధన్యవాదాలు తెలిపిన సీఎం









**అమరావతి,కలంకౌంటర్ :** అమరావతి రాజధానిగా చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో తిరుగులేని శాసనం చేశారని.. ఇది ప్రజా సంకల్పానికి దక్కిన గౌరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. రాజధానికి శంకుస్థాపన చేసిన ఉద్దండరాయునిపాలెం వద్ద గురు వారం రైతులతో కలిసి సతీ సమేతంగా అమరావతికి దీపహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాటాడుతూ..."దేశ చరిత్రలో అమరావతి విజయం సువర్ణ అక్షరాలతో లిఖించదగింది. అమరావతి చరిత్ర శాశ్వతం.. అందులో రైతులు చేసిన త్యాగం శాశ్వతం. అనేక కుట్రలను ఎదుర్కొని రాజధానిని దక్కించుకున్నాం. రాజధానిని స్మశానం అన్న వారు నేడు అడ్రస్ లేకుండా పోయారు. అమరావతిపై పార్లమెంటులో తిరుగులేని శాసనం చేసుకున్నాం. ఇప్పటి వరకు రాష్ట్రానికి అడ్రస్ లేదు, కానీ నేడు ఒక శాశ్వత అడ్రస్ వచ్చింది. అమరావతి రాజధాని ఆంధ్రుల ఆత్మగౌరవానికి చిహ్నం. 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చి చేసిన త్యాగం వల్లే ఈ విజయం సాధ్యమైంది. 1,631 రోజుల ఉద్యమం ఒక చరిత్ర. ఉద్యమాన్ని అడ్డుకున్న ప్రభుత్వంపై రాజధాని రైతులు, మహిళలు వీరత్వం, ప్రతాపం చూపారు. నాడు ముళ్ల కంచెలు దాటుకుని ఉద్యమం చేస్తున్న రైతుల వద్దకు పవన్ కళ్యాణ్ వచ్చారు. భువనేశ్వరి తన చేతికి ఉన్న రెండు గాజులను రాజధాని రైతుల ఉద్యమానికి విరాళంగా ఇచ్చారు. ఒక్క అడుగూ వెనక్కుక తగ్గినా... తర్వాత పది అడుగులు వేసి సింహాల్లా దూకారు. 2024లో కూటమి పార్టీకి అద్భుత విజయం అందించారు...

## పార్లమెంట్ లో అమరావతి బిల్లు ఆమోదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం



**అమరావతి,కలంకౌంటర్ :** పార్లమెంట్‌లో ఏపీ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు–2026 ఏకగ్రీవంగా ఆమోదం పొందడం చారిత్రాత్మకం. ఆంధ్రుల ఆకాంక్ష నెరవేరింది.. అమరావతికి లభించిన ఈ గౌరవం ప్రతీ ఆంధ్రుడికి గర్వకారణం. ప్రధాని నరేంద్ర మోదీకి హృదయపూర్వక కృతజ్ఞతలు.. అమరావతి ప్రస్థానంలో ప్రతీ అడుగులో ప్రధాని అండగా నిలిచారు 2015లో రాజధానికి శంకుస్థాపన, 2025లో పునర్నిర్మాణం... ప్రధాని మోదీ చేతుల మీదుగానే జరిగింది. కేంద్ర ప్రభుత్వం సహా హోంమంత్రి అమిత్ షా పూర్తిగా సహకరించారు. పార్లమెంటులో ఈ బల్లుకు సహకరించిన అన్ని రాజకీయ పార్టీలకు ధన్యవాదాలు. ఈ విజయం అమరావతి రైతులకు అంకితం. రాజధాని కోసం వారు చేసిన త్యాగం, చూపిన పట్టుదల మరువలేనివి. అమరావతి ఇక ఆంధ్రులకు ఏకైక ప్రజా రాజధాని. రాజధానిపై ఇక ఎలాంటి అనుమానాలకు, చర్చలకు తావులేదు. రాష్ట్ర విభజన తర్వాత ఎదుర్కొన్న చీకటి రోజులకు ఇది ముగింపు. ఏపీ ప్రగతికి ఈ నిర్ణయం కొత్త నాంది. ఏపీకి గుండె, ఆత్మ అయిన అమరావతి ఇక అన్‌స్టాపబుల్. దేశానికే అద్వితీయమైన భవిష్యత్ నగరంగా అమరావతి నిలుస్తుంది. అమరావతి సుస్థిరతతో నూతన శకం ప్రారంభమైంది.

# అమరావతి ఇక అన్ స్టాపబుల్

●ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇది చారిత్రాత్మకం ● ఈ చారిత్రక విజయం అమరావతి రైతులకు అంకితం ● సుస్థిరతకు, రాష్ట్ర ప్రగతికి, అభివృద్ధికి ఇది ఒక కొత్త నాంది ● ప్రధాని నరేంద్ర మోదీకి, అమిత్ షాకు హృదయపూర్వక ధన్యవాదాలు ●పార్లమెంట్‌లో ఏపీ పునర్వ్యవస్థీకరణ (సవరణ)బిల్లు-2026 ఆమోదంపై సీఎం చంద్రబాబు హర్షం




**అమరావతి,కలంకౌంటర్ :** రాజధానిగా అమరావతికి చట్టబద్దత లభించడం..రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పార్లమెంటులోని ఉభయ సభల్లో 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2026' ఏకగ్రీవంగా ఆమోదం పొందటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు, వారి సంకల్పానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలు నేడు దేశ రాజధానిలో ప్రతిధ్వనించాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సీఎం ధన్యవాదాలు తెలియజేశారు. అమరావతి ప్రస్తానంలో ప్రధాని మోదీ ప్రతీ కీలక సందర్భంలోనూ అండగా నిలిచారని గుర్తు చేశారు. 2015 అక్టోబర్ 22 తేదీన అమరావతికి శంకుస్థాపన చేయటంతో పాటు, 2025 మే 2న అమరావతి పునర్నిర్మాణ పనులను కూడా ప్రధాని చేతుల మీదుగానే ప్రారంభించుకోవడం గర్వకారణమని సీఎం పేర్కొన్నారు. అమరావతికి వెన్నుదన్నుగా నిలిచిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ప్రభుత్వానికి, రాజధాని బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీలకు, పార్లమెంటు సభ్యులకు ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాజధాని లేక అనేక సవాళ్లను, అనిశ్చితిని ఎదుర్కొందని... అలాంటి క్లిష్ట సమయంలో అమరావతి రైతులు చేసిన అమూల్యమైన త్యాగం, వారి పట్టుదల, నమ్మకం రాజధాని కలను సజీవంగా ఉంచాయని కొనియాడారు. ఈ చారిత్రక విజయాన్ని అమరావతి రైతులకు అంకితం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. అమరావతిని ఏకైక ప్రజా రాజధానిగా పేర్కొంటూ పార్లమెంట్ తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రంలో ఒక కొత్త శకానికి నాంది పలికిందన్నారు. రాజధానిగా అమరావతి హోదా ఇక సుస్థిరం. దీనిపై ఇక ఎటువంటి అనుమానాలకు, చర్చలకు తావులేదన్నారు. ఆంధ్రప్రదేశ్ కు గుండె, ఆత్మ అయిన అమరావతి ఇక అన్‌స్టాపబుల్ అని సీఎం పేర్కొన్నారు. దేశానికే అమరావతి ఒక అద్వితీయమైన భవిష్యత్ నగరంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. అమరావతి ద్వారా లభించే ఈ స్థిరత్వం ప్రతీ ఆంధ్రుడిలో కొత్త విశ్వాసాన్ని నింపాలని ఆయన ఆకాంక్షించారు.

## ఆర్టీపీపీలో రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి

●ఏపీ జెన్కో ఇంజనీర్లకు అభినందనలు ● సమిష్టి కృషితో తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్ సరఫరా ● ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ రంగ చరిత్రలో ఏపీ జెన్కో మరో సరికొత్త రికార్డును నెలకొల్పింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు అత్యధిక విద్యుత్ ఉత్పత్తిని సాధించింది. 1,650 మెగావాట్ల ఆర్టీపీపీ మొత్తం సామర్థ్యానికి గానూ, బుధవారం నాడు 1,643 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని సాధించింది. ఆర్టీపీపీ తొలిసారి ఈ రికార్డు సాధించడం పై ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీపీపీ ఇంజనీర్లను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ప్లాంట్ చరిత్రలో తొలిసారిగా 99.58 శాతం ప్లాంట్ లోడింగ్ ఫ్యాక్టర్ (ర్రాఫ్) నమోదు చేయడం ఏపీ జెన్కో సాధించిన ఘన విజయమని మంత్రి గొట్టిపాటి కొనియాడారు. సీఎం ఆశయ సాధన దిశగా అహర్నిశలు శ్రమిస్తున్న జెన్కో ఇంజనీర్ల అంకితభావం వల్లే ఈ రికార్డు సాధ్యమైందని మంత్రి స్పష్టం చేశారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కేవలం విద్యుత్ ఉత్పత్తిలోనే కాకుండా, వినియోగదారులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు డిస్కంలు, ట్రాన్స్ కో ఇంజనీర్లు కూడా సమిష్టిగా పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

## వై ఎస్ జగన్ ను కలిసిన వృద్ధురాలు





**తాడేపల్లి,కలంకౌంటర్ :** వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్–సీపీ అధినేత వైయస్ జగన్‌ను కలిసిన గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం రాయపూడికి చెందిన 90 ఏళ్ళ వృద్దురాలు నెల్లూరి శేషగిరమ్మ. రాజధాని అమరావతి కోసం భూమిని సేకరించే క్రమంలో తన భూమిని అక్రమంగా లాక్కున్నారని, సీఆర్‌డీఏ అధికారులు నష్టపరిహారం ఇస్తామని మోసం చేశారని వైయస్ జగన్ వద్ద కన్నీటిపర్యంతం అయిన శేషగిరమ్మ, తనకు న్యాయం చేయాలని రెవెన్యూ, సీఆర్డీఏ అధికారుల చుట్టూ తిరిగినా ఏ ఒక్కరూ తనకు న్యాయం చేయలేదని తన ఆవేదనను వైయస్ జగన్ దృష్టికి తీసుకొచ్చిన శేషగిరమ్మ, శేషగిరమ్మకు భరోసానిచ్చిన వైయస్ జగన్, ఆమెకు న్యాయం జరిగే వరకూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఈ సందర్భంగా వైయస్ జగన్‌ను కలిసిన శేషగిరమ్మ కుటుంబ సభ్యులు బ్రహ్మేంద్ర కుమార్, శ్రీనివాస్.

## వైయస్ జగన్‌ను కలిసిన నూతన ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు



**తాడేపల్లి,కలంకౌంటర్ :** నూతనంగా ఎన్నికైన ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యులు వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు తమ ఎన్నికపై వైయస్ జగన్ గారి నాయకత్వం, మార్గదర్శకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, న్యాయవాదుల సంక్షేమం, న్యాయ వ్యవస్థ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. వైయస్ జగన్ నూతనంగా ఎన్నికైన సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలని, న్యాయ సేవలు ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. అలాగే న్యాయ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసం పెంపొందించడంలో బార్ కౌన్సిల్ సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ లీగల్ సెల్ ప్రెసిడెంట్ మలసాని మనోహర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జల్లా సుదర్శన్ రెడ్డి, నూతన బార్ కౌన్సిల్ సభ్యులు కొమ్మసాని శ్రీనివాసుల రెడ్డి (ఏపీ హైకోర్ట్), రోళ్ళ మాధవి (ఏపీ హైకోర్ట్), వెంకట్రామి రెడ్డి కొవ్వూరి (ఏపీ హైకోర్ట్), రామిరెడ్డి ఆలూరు (అనంతపురం), బ్రహ్మారెడ్డి వట్టిజొన్నల (గుంటూరు), క్రిష్ణారెడ్డి బి.వి (ఏలూరు) పాల్గొన్నారు.

## మానవాళి కోసం జీసస్ మహాత్యాగమే గుడ్ ఫ్రైడే సందేశం

● మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్.



**తాడేపల్లి,కలంకౌంటర్ :** కరుణామయుడైన ఏసు ప్రభువు జీవితమే త్యాగానికి చిహ్నం. ఆ ప్రభువును శిలువ వేసిన గుడ్ ఫ్రైడే రోజు. ఆ తరువాత ఆయన పునరుజ్జీవించిన ఈస్టర్ సండే రోజు.. ఈ రెండూ మానవాళి చరిత్రను మలుపు తిప్పిన ఘట్టాలు అని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మనుషులపై ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం, నిస్వార్థ జీవనం.. ఇవన్నీ తన జీవితం, బోధనల ద్వారా ఈ లోకానికి జీసస్ ఇచ్చిన సందేశాలు అని వైయస్ జగన్ పేర్కొన్నారు.

# ఎం ఎల్ ఎ కి ఉగాది పంచాంగం



**ఒంగోలు,కలంకౌంటర్ :** కలంకౌంటర్ దినపత్రిక సభ్యులు దామచర్ల జనార్ధన్ రావు కి అందజేస్తున్న ఉగాది తెలుగు పంచాంగాన్ని ఒంగోలు శాసన ప్రకాశం జిల్లా ఇన్చార్జి డాక్టర్ వెంకట కేశవరావు

# బీసీ ధర్మ దీక్ష పేరుతో ఆమరణ నిరాహార దీక్ష

- బీసీల హక్కులకై చారిత్రక ఘట్టం
- ప్రభుత్వానికి మార్చి 31 డెడ్‌లైన్ ముగింపు



**మంగళగిరి,కలంకౌంటర్ :** బీసీల న్యాయమైన హక్కుల సాధనకై భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్, ముందుగా ప్రకటించిన విధంగా ఏప్రిల్ 11వ తేదీ నుండి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నారు. "బీసీ సింహగర్జన" సభలో ప్రభుత్వం ముందు ఉంచిన ఐదు కీలక డిమాండ్లపై ఇచ్చిన గడువు ముగిసినా ప్రభుత్వం నుండి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో, ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మంగళగిరిలోని బీసీవై పార్టీ కేంద్ర కార్యాలయం "పూలే-మండల్ భవన్" వేదికగా "బీసీ ధర్మ దీక్ష" పేరుతో ఈ ఆమరణ నిరాహార దీక్ష జరగనుంది. దశాబ్దాలుగా బీసీలు ఎదుర్కొంటున్న చారిత్రక అన్యాయానికి వ్యతిరేకంగా, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రామచంద్ర యాదవ్ ఈ కఠోర దీక్షకు పూనుకున్నారని పార్టీ పేర్కొంది.

**ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాల్సిన ఐదు కీలక డిమాండ్లు**

**బీసీ రక్షణ చట్టం:** బీసీల సామాజిక భద్రత కోసం ప్రత్యేకంగా "బీసీ రక్షణ చట్టాన్ని" వెంటనే అమలు చేయాలి

**అమరావతిలో భూమి:** రాజధాని అమరావతిలో బీసీల ఆత్మగౌరవ భవనాలు, ఇతర అవసరాల కోసం వెయ్యి ఎకరాలు కేటాయించాలి

**సమగ్ర కులగణన:** రాష్ట్రంలో శాస్త్రీయ ప్రాతిపదికన సమగ్ర కులగణన చేపట్టి, బీసీల కచ్చితమైన జనాభా లెక్కలను తేల్చాలి

**44% రిజర్వేషన్లు:** విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు వారి జనాభా దామాషా ప్రకారం 44 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**బీసీ కార్పొరేషన్లకు నిధులు:** నిర్వీర్యం చేయబడిన బీసీ కార్పొరేషన్లకు తక్షణమే నిధులు విడుదల చేసి, బీసీ యువతకు స్వయం ఉపాధి కల్పించాలి ప్రభుత్వం బీసీల సహనాన్ని పరీక్షించవద్దని, వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బీసీవై పార్టీ హితవు పలికింది. ఈ ధర్మ దీక్షకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ సోదరులు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు సంఘీభావం తెలిపి, విజయవంతం చేయాలని పార్టీ పిలుపునిచ్చింది.

# పల్లపోతును ఘనంగా సన్మానించిన బైసాని











**ఒంగోలు, కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం సీనియర్ నాయకులు పల్లపోతు వెంకటేశ్వరరావు గురువారం సూపర్ బజార్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఒంగోలు వైశ్య భవన్ నందు పల్లపోతు వెంకటేశ్వరరావును ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు, ఐవిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైసాని వెంకట సుబ్బారావు ఘనంగా సన్మానించారు. పేరుతో పాటుగా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావును, గౌరవ సలహాదారులు జలదంకి వెంకటకృష్ణారావును, ప్రధాన కార్యదర్శి మువ్వల శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఎన్టీఆర్ కళాపరిషత్ నందు పల్లపోతు వెంకటేశ్వర రావును బైసాని సుబ్బారావు ఘనంగా సన్మానించారు. పల్లపోతు వెంకటేశ్వరరావు భవిష్యత్తులో శ్రీ వాసవి మాత ఆశీస్సులతో, శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు ఆశీస్సులతో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



**ఒంగోలు,కలంకౌంటర్ :** ఒంగోలు సూపర్ బజార్ చైర్మన్ గా ప్రమాణస్వీకారం సందర్భంగా కలంకౌంటర్ దినపత్రిక ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన ఒంగోలు సూపర్ బజార్ నూతన చైర్మన్ పల్లపోతు వెంకటేశ్వరరావు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఇన్చార్జి డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, ఆర్యవైశ్య నాయకులు మువ్వల శ్రీనివాసులు, బైసాని వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సూపర్ బజార్ చైర్మన్ గా పల్లపోతు ప్రమాణ స్వీకారం





**ఒంగోలు,కలంకౌంటర్ :** ఒంగోలు సూపర్ బజార్ చైర్మన్ గా గురువారం ఎన్టీఆర్ కళాపరిషత్ నందు పల్లపోతు వెంకటేశ్వర్లు చైర్మన్ గా, వెంకటేశ్వర్లు, పులివర్తి డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం ఎంతో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డుండి రాకేష్,ఓడా చైర్మన్ షేక్ రియాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ ఎంతో సీనియర్ నాయకుడు, తెలుగుదేశం పార్టీలో పార్టీ కి అంకిత భావంతో పనిచేసిన పల్లపోతు వెంకటేశ్వరరావు చేయడం ఆయనకు దక్కిన గౌరవం అని అన్నారు. ఒంగోలు సూపర్ బజారును మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంస్య విగ్రహ నిర్మాణంలో రాకేష్ ది కీలక పాత్ర అని, రాకేష్ కు అభినందనలు తెలిపారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డుండి రాకేష్ మాట్లాడుతూ 2024 ఎన్నికలకు ముందు ఒంగోలులో శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ తాను బాధ్యతలను తీసుకొని ఎంతో వైభవంగా మహానాడు ను నిర్వహించాడని, అది తెలుగుదేశం పార్టీ గెలుపునకు నాంది పలికిందనిఅన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తనతో కలిసి రాష్ట్ర మొత్తం పల్లపోతు వెంకటేశ్వర్లు ఏమి ఆశించకుండా తిరిగాడని అన్నారు. దామచర్ల జనార్దన్ రావు ఆశీస్సులతో భవిష్యత్తులో పల్లపోతు వెంకటేశ్వరరావు మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం దామచర్ల జనార్ధన్ చైర్మన్ పల్లపోతు వెంకటేశ్వర్లను, డైరెక్టర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ గంగాడి సుజాత, మాజీ సూపర్ బజార్ చైర్మన్ లు తాతా ప్రసాద్, వేమూరి బుజ్జి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, పల్లపోతు నాని, కొల్లిపర సురేష్, బిజెపి నాయకులు తమ్మన శ్రీను, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పల్లపోతు అభిమానులు భారీ సంఖ్యలో హాజరై పల్లపోతుకు అభినందనలు తెలిపారు.



ఒంగోలు సూపర్ బజార్ నూతన చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన పల్లపోతు వెంకటేశ్వరరావు ను ఘనంగా సన్మానిస్తున్న టిడిపి కనిగిరి నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షుడు పందిటి హరీష్.

-ఒంగోలు, కలంకౌంటర్ :








## ఉపాస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు

-కందుకూరు,కలంకౌంటర్ :

# జనసేనలో చేరిన మహాసభ మాజీ అధ్యక్షుడు సి హెచ్ ఆర్

## -భారీ ర్యాలీగా చేరికలు





**జంగారెడ్డిగూడెం,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ జనసేన పార్టీలో చేరారు.భారీ ర్యాలీ నిర్వహించి పెద్ద సంఖ్యలో అనుచరులతో కలిసి రాష్ట్ర నాయకులు సమక్షంలో పార్టీలో చేరారు.గ్రీన్ ఫీల్డ్ వద్ద నుంచి జంగారెడ్డిగూడెం సూర్య కళ్యాణ మండపం వరకు కార్లు, బైక్ లతో సందడి చేశారు.జనసేన పార్టీ అధ్యక్షుడు రామ్ తాళ్లూరి, ఏలూరు జడ్పీటీ సి బాబ్జి ,చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ మేక ఈశ్వరయ్య సమక్షంలో చిన్ని రామ సత్యనారాయణతో పాటు కొల్లేపర ఆనంద్ ,వాస రామకృష్ణ ,మల్లాది విష్ణు తదితరులు ఉన్నారు






# సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా గంగిశెట్టి రాజేశ్వరరావు



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ హై కోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ 2026-2027 ఎలక్షన్స్ లో సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా హై కోర్టు న్యాయవాది గంగిశెట్టి రాజేశ్వర రావు(రాజేష్) ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు హై కోర్టు న్యాయవాదులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు

# రైతుల పోరాటం గెలిచింది.. అమరావతి శాశ్వతంగా నిలిచింది

- పార్లమెంటులో అమరావతి బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం హర్షణీయం
- రాజధాని రైతులు, మహిళల త్యాగాలు వృథా కాలేదు
- సీఎం చంద్రబాబు నేతృత్వంలో అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా విరాజిల్లుతుంది
- మావిగన్ జగన్ రెడ్డికి దేశం పారాగన్ బుద్ధి చెప్పింది
- అనకాపల్లి జనసేన కార్యాలయం నుండి మంత్రి కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో భారీ ర్యాలీ





**అనకాపల్లి,కలంకౌంటర్ :** పార్లమెంటు ఉభయ సభలు అమరావతి బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం రాష్ట్ర ప్రజలు, రైతుల విజయం అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా అనకాపల్లి పట్టణంలోని జనసేన కార్యాలయం నుండి మహిళలు, యువత ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్ర గారు మాట్లాడుతూ... ఆంధ్రుల కల అమరావతికి చట్టబద్ధత రావడం పట్ల రాష్ట్ర ప్రజలంతా పండుగ చేసుకుంటున్నారు. ప్రధానంగా అమరావతి ఉద్యమాన్ని ముందుండి నడిపించిన మహిళలకు ధన్యవాదాలు. రాష్ట్రాన్ని విడగొట్టి రాజధాని కూడా లేని పరిస్థితుల్లో శివరామకృష్ణన్ కమిషన్ నివేదిక మేరకు విజయవాడ గుంటూరు మధ్య అమరావతిని రాజధానిగా ప్రకటించాం. చంద్రబాబు గారిపై నమ్మకంతో 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూములిచ్చారు. దేశ వ్యాప్తంగా పుణ్య నదుల నుంచి నీరు, పుణ్యక్షేత్రాల నుంచి మట్టి తీసుకొచ్చి ప్రధానమంత్రి గారి చేతుల మీదుగా శంకుస్థాపన చేసాం. ఢిల్లీని మించిన రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దామని ఆరోజు హామీ ఇచ్చాం. అందుకు అనుగుణంగా సచివాలయం అసెంబ్లీ హైకోర్టు సహా అనేక భవనాలను నిర్మించాం. ఫేక్ హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి మూడు రాజధానుల పేరుతో అమరావతిని నాశనం చేయాలనుకున్నాడు. సౌత్ ఆఫ్రికా మోడల్ అంటూ వైజాగ్ అమరావతి కర్నూలులో మూడు రాజధానులు ఏర్పాటు చేస్తానని దగా చేశాడు. ఐదేళ్లు అమరావతిలో రైతుల్ని హింసించాడు. దేవాలయాలకు వెళ్ళే మహిళా రైతులని అవమానించాడు. బూటు కాళ్ళతో మహిళల పొత్తికడుపులో తన్నించాడు. అమరావతి రాజధాని అని కోర్టులు తేల్చి చెప్పినా వినకుండా మూర్ఖంగా ప్రవర్తించాడు. 2024 ఎన్నికల్లో ప్రజలంతా ఏకమై జగన్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్పి... అమరావతి రాజధాని అని నినదించారు. 151 నుండి 11 కి పడేశారు. తాజాగా అమరావతిపై అసెంబ్లీలో తీర్మానానికి కూడా ఎగ్గొట్టాడు. ఈరోజు పార్లమెంటులో తీర్మానం పెడితే వైసీపీ ఎంపీలతో వాకౌట్ చేయించాడు. అమరావతి అంటే జగన్ రెడ్డికి ఎందుకింత కడుపు మంట.? రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిని వికేంద్రీకరిస్తోంది. ఉత్తరాంధ్రలో అర్సలామెట్టల్ స్టీల్ ప్లాంట్, గూగుల్ లాంటి ప్రఖ్యాత కంపెనీలను తీసుకొస్తున్నాం. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్, రాయలసీమలో ఎలక్ట్రానిక్స్ క్లస్టర్, హార్టికల్చర్ అభివృద్ధి చేస్తున్నాం. ఐదేళ్లు అమరావతిపై కాలకూట విషం చిమ్మిన జగన్.. నిన్న మావిగన్ అనే కొత్త పేరు చెప్పాడు.. మొన్నటి వరకు మూడు రాజధానులు అన్నాడు.. ఇప్పుడు మావిగన్ అంటున్నాడు. పిచ్చి మందు పేరు మావిగన్ అయ్యుండచ్చు. అందుకే జగన్ రెడ్డికి ఆ పేరు గుర్తొచ్చి చెప్తున్నాడు. రాష్ట్ర అభివృద్ధి పట్ల విషం చిమ్ముతున్న జగన్ రెడ్డికి వారి పార్టీకి రాష్ట్రంలో పుట్టగతులు ఉండవు. రాబోయే 25 సంవత్సరాలు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు బత్తుల తాతయ్య బాబు, పీలా గోవింద సత్యనారాయణ, మళ్ల సురేంద్ర, కోట్ని బాలాజీ, పి.వి.జి.కుమార్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా నాగ జగదీష్, బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారంపూడి పరమేశ్, బీజేపీ నాయకులు ముత్యాల వెంకటేశ్వర రావు, జనసేన నాయకులు భీమరశెట్టి రాంకీ తదితర నాయకులు కార్యకర్తల భారీగా పాల్గొన్నారు.

# అమరావతికి చట్టబద్ధతపై కందుకూరు ప్రజల హర్షం

- ఎన్టీఆర్ సర్కిల్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఉత్సవ ర్యాలీ
- మారుమోగిన జై అమరావతి నినాదం



**కందుకూరు,కలంకౌంటర్ :** రాష్ట్ర రాజధాని అమరావతికి పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ... కందుకూరు పట్టణంలో గురువారం సాయంత్రం పెద్ద ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచనలతో.... కూటమి పార్టీల ఆధ్వర్యంలో ఉత్సవ ర్యాలీ జరిగింది. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పోస్ట్ ఆఫీస్ సెంటర్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు కార్యక్రమం కొనసాగగా... మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మోదీ, చంద్రబాబు న్యాయకత్వం వర్ధిల్లాలి, జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. ముందుగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ శాసనసభ్యులు దివి శివరాం సహా పలువురు నేతలు పూలమాలవేసి ర్యాలీ ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద శివరాం మాట్లాడుతూ రాజధాని కోసం 33 వేలఎకరాలు ఇచ్చిన రైతులను నానా ఇబ్బందులు పెట్టినా, రాజధానిని అడ్డుకోవాలని చూసినా, చివరకు ధర్మమే గెలిచిందన్నారు. ప్రధానమంత్రి మోడీ సహకారంతో పార్లమెంటు ఉభయ సభల్లో రాజధానికి చట్టబద్ధత ఏర్పడిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టుదలతో, భావితరాల భవిష్యత్తు కోసం అమరావతిని విశ్వ నగరంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ప్రజలంతా ఆయనకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు మాట్లాడుతూ పార్లమెంట్ తీర్మానం పట్ల ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తుంటే... జగన్ మాత్రం ఇంకా సిగ్గు లేకుండా ఏవేవో మాట్లాడుతున్నారని విమర్శించారు. అమరావతి పూర్తయితే తనకు రాజకీయ భవిష్యత్తు ఉండదని జగన్ భయపడుతున్నారని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి ఇక తిరుగు లేదన్నారు. మ-రోసారి జగన్ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదన్నారు. నియోజకవర్గ బిజెపి కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు మాట్లాడుతూ అమరావతికి భూములు ఇచ్చిన రైతులతోపాటు, రాష్ట్ర ప్రజల ఆకాంక్ష నెరవేరిందన్నారు. కేంద్రం సహకారంతో రాజధాని అత్యద్భుతంగా తయారవుతోందని ప్రశంసించారు. కార్యక్రమంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాణాసంచా కాలుస్తూ.. స్వీట్లు పంచుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ ర్యాలీలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, పట్టణ మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, నార్నే రోశయ్య, ఉప్పుటూరి శ్రీను, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బెజవాడ ప్రసాద్, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, గోచిపాతల మోషే, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ, తెలుగురైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, ఐటిడిపి అధ్యక్షుడు షేక్ మున్నా, బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బంటుమిల్లి సెయింట్ జాన్స్ హై స్కూల్ లో అమరావతి సంబరాలు




**బంటుమిల్లి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని పార్లమెంటులో ఆమోదించ డం పట్ల గురువారం బంటుమిల్లి పట్టణంలోని సెయింట్ జాన్స్ హై స్కూల్లో అమరావతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు ప్లే కార్డులు చేత పట్టి ప్రజా రాజధాని అమరావతి ,అమరావతి అంటేనే అభివృద్ధి తదితర స్లొగన్స్ తో ప్ల కార్డులు చేతబట్టి హర్షం వ్యక్తం చేశారు. అలాగే పాఠశాల డైరెక్టర్ సాబుజాన్ ప్రిన్సిపాల్ ఝాన్సీ సాబు లు కేక్ కట్ చేసి విద్యార్థిని విద్యార్థులకు ఉపాధ్యాయులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సాబుజాన్ మాట్లాడుతూ ఇప్పటివరకు రాజధాని లేని మన రాష్ట్రానికి రాజధాని గా అమరావతిని పార్లమెంట్లో ఆమోదించడం ఎంతో సంతోషదాయకమని ప్రజా రాజధాని అమరావతి అభివృద్ధికి ఆటంకం ఉండదని అన్నారు. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ హర్షాతిరేకములు వ్యక్తం చేశారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com